# ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



బజార్‌హత్నూర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ(బజార్‌హత్నూర్), ఏప్రిల్ 21: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. బజార్‌హత్నూర్ మండలం ఏసాపూర్ గ్రామంలో సోమవారం తగిరె లక్ష్మణ్ నాయక్ నిర్వహించిన పూరి జగన్నాథ్ మహా ప్రసాద్ బండార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుర సమాజ్ సంప్రదాయ పూజల్లో పాల్గొన్నారు. ముందుగా దేవి సింగ్ మహారాజ్, రాంసింగ్ మహారాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నానక్ సింగ్, ఉత్తమ్ సింగ్, ధరమ్ సింగ్ (యోగి), చందర్ సింగ్, కవీందర్ సింగ్, కైలాష్ సింగ్, భగవాన్ సింగ్, బామాన్ నర్సు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

నేరడిగొండ, ఏప్రిల్ 21: ఎండ తీవ్రత పెరుగుతున్నందున నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు. నేరడిగొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించారు. ఎండ తీవ్రతకు నెత్తిన టోపి లేదా రుమాలు చుట్టుకోవాలన్నారు. ఉప్పు కలిపిన మజ్జిగతో పాటు నీటిని ఎక్కువ తాగాలని సూచించారు. వడదెబ్బ సోకిన వారిని వెంటనే దవాఖానలో చికిత్స చేయించి, వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలని కోరారు.

# క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- పోలీసు సాయుధ కార్యాలయం సందర్శన



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, ఏప్రిల్ 21: సాయుధ పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో పాటు నిజాయితీతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీసు సాయుధ ముఖ్య కార్యాలయాన్ని సోమవారం ఆయన పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. సమయపాలన పాటిస్తూ కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, తరచూ విధులకు గైర్హాజరైన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువ పోలీసులకు సాంకేతికపరమైన విధులు కేటాయిస్తామని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు సాయుధ పోలీసులు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. విధుల్లో సమస్యలుంటే తనకు తెలియజేయాలని, సత్వరమే పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. సిబ్బందికి ఉన్న సెలవులు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పెషల్ పార్టీ సిబ్బంది విధుల్లో లాఠీ తప్పకుండా తీసుకెళ్లాలని సూచించారు. సిబ్బందికి విధులను రొటేషన్ పద్ధతిలో కేటాయించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ హెడ్ క్వార్టర్‌లో ఉన్న మోటార్ వెహికల్ అధికారి కార్యాలయం, పోలీసులు వినియోగిస్తున్న వాహనాలు, వాటి రికార్డులతో పాటు స్టోర్స్ విభాగాన్ని పరిశీలించారు. అనంతరం హోంగార్డ్ కార్యాలయాన్ని సందర్శించారు. హోంగార్డులు చేస్తున్న విధులపై పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరి పూర్తి వివరాలు తెలుసుకొని, వారు సర్వీస్‌లో చేసిన పనులను ఓ రికార్డులో పొందుపరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటి, టీ మురళి, ఎన్ చంద్రశేఖర్, శ్రీపాల్, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్ ఎదుట మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు కిరణ్ కొమ్రేవార్

## అక్రమ కేసులకు భయపడేది లేదు

ముథోల్, ఏప్రిల్ 21 : బీఆర్‌ఎస్ సోషల్ మీడియా డిజిటల్ కన్వీనర్ దిలీప్‌పై అక్రమ కేసులు బనాయించినా భయపడేది లేదని నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వయ సమితి సభ్యుడు కిరణ్ కొమ్రేవార్ అన్నారు. సోమవారం ముథోల్‌లో బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్‌పై పెట్టిన కేసు విచారణలో భాగంగా లీగల్ సెల్ న్యాయవాది భాస్కర్‌గౌడ్‌తో కలిసి ముథోల్ పోలీస్‌స్టేషన్‌కు హాజరై సంఘీభావాన్ని తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ బాసర మండల శాఖ అధ్యక్షుడు శ్యామ్, ఆష్టా మాజీ సర్పంచ్ అశోక్, పోశెట్టి, రవి, మహేశ్, లోకన్ శ్రీనివాస్ ఉన్నారు.



ముథోల్ : మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

## సీఎంఆర్ అప్పగించాలి

భైంసా, ఏప్రిల్ 21: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ బకాయిలు వెంటనే అప్పగించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ఆమె రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, గతంలో మిల్లర్లు ప్రాసెసింగ్‌కు తీసుకున్న ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్ వెంటనే చెల్లించాలన్నారు. గడువులోగా చెల్లించని మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఆర్డీవో కార్యాలయాన్ని సందర్శించి రికార్డు గది, సిబ్బంది విధులను పరిశీలించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీవో కోమల్ రెడ్డి, సివిల్ సప్లయ్ డీఎం సుధాకర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, రైస్ మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

**సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్**

బాసర, ఏప్రిల్ 21: బాసర సరస్వతీ అమ్మవారిని సోమవారం కలెక్టర్ అభిలాష అభినవ్ దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు, వైదిక బృందం ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు.

**భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి**

బాసర/ముథోల్, ఏప్రిల్ 21: భూ సమస్యలను పరిష్కరించడానికే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బాసరతో పాటు ముథోల్ మండలం కారేగాంలోని రైతు వేదికల్లో సోమవారం రైతులకు భూభారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయా చోట్ల రైతుల సమస్యలను కలెక్టర్ ఓపికగా విని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, ప్రత్యేకాధికారి సుదర్శన్, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, తహసీల్దార్లు పవన్‌చంద్ర, శ్రీకాంత్, ఎంపీడీవో శివకుమార్, ఆర్ఐ అభిమన్యు, తదితరులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- తెలంగాణకు బీఆర్‌ఎస్ శ్రీరామ రక్ష
- పార్టీ దస్తురాబాద్ మండలాధ్యక్షుడు ముడికే ఐలయ్య యాదవ్



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ముడికే ఐలయ్య యాదవ్

దస్తురాబాద్, ఏప్రిల్ 21: హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ముడికే ఐలయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ పార్టీకి ధ్యాస, శ్వాస తెలంగాణే అని అన్నారు. తెలంగాణకు బీఆర్‌ఎస్ పార్టీయే శ్రీ రామరక్ష అని పేర్కొన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ భూక్యా రాజు నాయక్, మాజీ సర్పంచ్ దుర్గం శంకర్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అర్గుల రాజనర్సయ్య, నాయకులు బాదం లక్ష్మీరాజం, దాసరి సుధాకర్, ఎండపెల్లి గంగన్న, బొమ్మెన గోపి, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## డీఎల్ఎస్‌ఏ సెక్రటరీ బదిలీ

ఎదులాపురం, ఏప్రిల్ 21: డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ (డీఎల్ఎస్ఏ) సెక్రటరీ బోవనగిరి సౌజన్యను సంగారెడ్డి జిల్లా డీఎల్ఎస్ఏ సెక్రటరీగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, ఆదిలాబాద్ సీనియర్ సివిల్ సెషన్స్ జడ్జి డాక్టర్ ప్రమీలా జైన్ నల్లగొండ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో రంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సీఎం రాజ్యలక్ష్మిని ఇక్కడికి బదిలీ చేశారు. కాగా, సీఎం రాజ్యలక్ష్మి డీఎల్ఎస్ఏ సెక్రటరీగా (ఎఫ్ఏసీ) కూడా బాధ్యతలు స్వీకరించనున్నారు.

## పేదింటి పెళ్లికి చేయూత



వధువు తండ్రికి నగదు అందజేస్తున్న గ్రామస్తులు

ఎదులాపురం, ఏప్రిల్ 21 : ఆ ఆదివాసీ పల్లెవాసులంతా పేదింటి ఆడపిల్లల పెళ్లి కోసం తలా కొంత జమచేసి నగదును అందజేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చించుగాట్ గ్రామానికి చెందిన ఆర్క సెడ్మారావు కూతురు పెళ్లి నిశ్చయమయింది. అయితే కుటుంబం కఠిక పేదరికంలో ఉన్నది. కుమ్ర శోభారాణి, రాజు పటేల్‌సహా గ్రామస్తులంతా కలిసి సోమవారం రూ.55 వేలు వధువు కుటుంబానికి అందజేశారు. ఆదివాసీలే హంగు ఆర్భాటాలకు దూరంగా ఉండాలని, ఖర్చులు తగ్గించాలని శోభారాణి సూచించారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎదులాపురం, ఏప్రిల్ 21: సివిల్ డ్రెస్సుల్లో పోలీసులు అంటూ వాహన తనిఖీలు చేపట్టినా, ఆభరణాలు, బంగారం అడిగిన వారు పోలీసులు కాదనే విషయాన్ని గ్రహించి, వెంటనే స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బేల మండలం కొబ్బాయి గ్రామ శివారులో నలుగురు వ్యక్తులు ఆదివారం మహారాష్ట్ర నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న దంపతులను పోలీసులమంటూ ఆపినట్లు పేర్కొన్నారు. ఈ రోడ్డుపై దొంగతనాలు జరుగుతున్నాయని, వారి వద్ద ఉన్న బంగారాన్ని తీసి ప్యాక్ చేసి ఇస్తామని చెప్పగా, నమ్మి తమ బంగారాన్ని తీసి ఇవ్వగా, దానికి బదులుగా వారు ముందుగానే ప్యాకెట్లో గులకరాళ్లను ఉంచి తిరిగి వారికి బంగారం అని ఇవ్వడం జరిగిందన్నారు. కొద్ది దూరం వెళ్లి చూడగా అందులో గులకరాళ్లు ఉన్నట్లు తెలుసుకొని, మోసపోయామని బాధితులు బేల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## విద్యుదాఘాతంతో సామగ్రి దగ్ధం

భైంసాటౌన్, ఏప్రిల్ 21 : మండలంలోని దేగాం గ్రామానికి చెందిన మాగిని రాజు ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి కాలిపోయింది. బాధిత కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజు ఇంట్లో నిరంతరాయంగా టీవీ ఆన్ చేసి ఉంచడంతో ఒక్కసారిగా పేలిపోయింది. ఎలక్ట్రికల్ పరికరాలు, నిత్యావసరుకులు, ఇతర వస్తువులు కాలిపోయాయి. రూ.2 లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు.

**జొన్న పంట దగ్ధం**

ఉట్నూర్ రూరల్, ఏప్రిల్ 21: మండలంలోని సాలేవాడ(కే) గ్రామానికి చెందిన రబాడే రాము నాలుగెకరాలు జొన్న పంట సాగు చేశాడు. పంట చేను మీదుగా కరెంటు లైన్లు ఉండగా, ఆదివారం రాత్రి షాట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. ఉదయం వెళ్లి చూడగా అప్పటికే రెండెకరాల జొన్న పంట కాలిపోయినట్లు బాధిత రైతు తెలిపాడు. సుమారు రూ. లక్ష మేరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

## ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు


ఖానాపూర్ రూరల్, ఏప్రిల్ 21: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రత్యేకాధికారి జీవరత్నం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు కోసం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్ రావు, పీఆర్‌జేఈ సూర్యతేజ పాల్గొన్నారు.

## లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

లక్ష్మణచాంద, ఏప్రిల్ 21: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో రాధ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరరంలో సోమవారం ఆమె ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, లబ్ధిదారుల ఎంపికపై సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సమావేశంలో ఎంపీవో అమరీఖాన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గ్యాస్ట్రో ఐపీ, ఓపీ సేవలు ప్రారంభం

ఎదులాపురం, ఏప్రిల్ 21: జిల్లా కేంద్రంలోని రిమ్స్ సూపర్‌స్పెషాలిటి దవాఖానలో గ్యాస్ట్రోలజీ ఐపీ, ఓపీ సేవలను సోమవారం ఎంపీ గొడం నగేశ్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ప్రారంభించారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్‌రాథోడ్ దవాఖాన నిర్వహణ, వైద్యుల భర్తీ, సిబ్బంది ఖాళీలు, ఇతర సమస్యలను ఎంపీ, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం గ్యాస్ట్రో వైద్యుడు వివేక్ రాథోడ్ ఎండోస్కోపి, ఇతర పరికరాల గురించి ఎంపీ, ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ గొడం నగేశ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ పేదల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్లు అశోక్, సత్యనారాయణ, ఆర్ఎంవో చంపత్‌రావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



గ్యాస్ట్రోలజీ పని తీరును ఎంపీ, ఎమ్మెల్యేకు వివరిస్తున్న వైద్యుడు వివేక్ రాథోడ్

## బాధితుల సమస్యలను పరిష్కరించాలి

ఎదులాపురం, ఏప్రిల్ 21: బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల విభాగంలో భాగంగా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సమస్యలను సత్వరమే పరిష్కరించి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. వివిధ మండలాల నుంచి 12 ఫిర్యాదులు రాగా.. వారి సమస్యలను ఓర్పుగా విన్నారు. కుటుంబ కలహాలు, భార్యాభర్తల సమస్యల వంటి సమస్యలు రాగా.. వాటిని పరిష్కరించే దిశగా అధికారులకు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా భూమి, ఆస్తి తగాదాల విషయంలో చట్టం, న్యాయపరంగా నడుచుకోవాలని తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను సమీక్షిస్తూ రిపోర్టును దాఖలు చేయాలని ఆదేశించారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన

సారంగాపూర్, ఏప్రిల్ 21: సారంగాపూర్‌లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్ పరిశీలించారు. కూలీల హాజరు శాతం, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కందకాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఉపాధి కూలీలకు తాగునీరు, నీడ సౌకర్యాన్ని కల్పించాలని, ఎండతీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా కూలీలు ఉదయం పనులకు వచ్చి ఎండ ముదరకముందే ఇంటికి వెళ్లాలని సూచించారు. అనంతరం సెగ్రిగేషన్‌షెడ్డులో సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. సెగ్రిగేషన్‌షెడ్డు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అజీజ్‌ఖాన్, ఏపీవో లక్ష్మారెడ్డి, టీఏ సునీల్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఎఫ్ఏ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, కూలీలు పాల్గొన్నారు.

## డీజేలకు అనుమతి లేదు

ఎదులాపురం, ఏప్రిల్ 21: జిల్లాలో రాత్రి 10 గంటల తర్వాత డీజే, మ్యూజిక్ శబ్దాలకు అనుమతి లేదని డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్‌లోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీజే యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పరిధిలో డీజే ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్, ఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఇచ్చోడ(సిరికొండ), ఏప్రిల్ 21: సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిరికొండ ఎస్ఐ శివరాం సూచించారు. సిరికొండ మండలం ఫకీర్‌నాయక్ తండాలో సోమవారం రాత్రి పోలీసులు మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు.

## కలెక్టర్‌కు వినతి

భైంసా, ఏప్రిల్ 21: మున్సిపల్ అధికారులు టెండర్ నిర్వహించకుండానే ప్రతి రోజూ చిరు వ్యాపారుల వద్ద ఫీజు వసూలు చేస్తున్నారని కలెక్టర్ అభిలాష అభినవ్‌కు బీజేపీ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి టెండర్ వేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మల్లేశ్, దిలీప్, తదితరులున్నారు.

## కొనసాగుతున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ అధ్యాపకుల దీక్ష

బాసర, ఏప్రిల్ 21: తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ట్రిపుల్ ఐటీ ఆవరణలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ అధ్యాపకులు చేపట్టిన నిరవధిక నిరసన దీక్ష సోమవారం నాటికి 13వ రోజుకు చేరింది. ఎండను లెక్క చేయకుండా అధ్యాపకులు దీక్షలో పాల్గొని నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

## బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

భైంసా, ఏప్రిల్ 21: భైంసా మండలం ఇలేగాం గ్రామానికి చెందిన నీలం సాయినాథ్ ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. రూ. ఐదు లక్షల ఆర్థిక సాయం మంజూరు కాగా, బాధిత కుటుంబసభ్యులకు సోమవారం ఎమ్మెల్యే రామారావు పటేల్ చెక్కు అందజేశారు. ఇక్కడ మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, నాయకులు సుష్మా రెడ్డి, సాంప్లీ రమేశ్, పండిత్ రావు, మధుకర్, సాయన్న, సాయిబాబా తదితరులున్నారు.

## జనావాసాల్లో పెంటకుప్పలు తొలగించాలి

కుభీర్, ఏప్రిల్ 21: మండల కేంద్రంలోని భట్టీగల్లీలో జనావాసాల్లో పెంట కుప్పలు పేరుకుపోయి అనారోగ్యానికి గురవుతున్నారని, వాటిని వెంటనే తొలగింపజేయాలని కాలనీవాసులు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కాలనీవాసులు నారడి మల్లేశ్ యాదవ్, తిప్ప దత్తాత్రి, బాబు, బాలాజీ, తదితరులున్నారు.

## అడవి పంది దాడిలో ఉపాధి కూలీకి గాయాలు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 21: అడవి పంది దాడిలో ఉపాధి హామీ కూలీకి గాయాలైన ఘటన మండలంలోని కెస్లాగూడ(జీ) గ్రామంలో సోమవారం జరిగింది. కుటుంబీకులు, ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్, టీఏ జాదవ్ విఠల్ తెలిపిన వివరాల ప్రకారం... కెస్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కెస్లాగూడ(జీ) గ్రామానికి చెందిన హేరేకుమ్ర శ్రీకాంత్ ఉదయం గుట్టను ఆనుకొని ఉన్న ఓ రైతుకు చెందిన వ్యవసాయ చేనులో తోటి కూలీలతో కలిసి ఉపాధి పనులు చేస్తున్నాడు. అడవి పంది వెనుక నుంచి వచ్చి దాడి చేసినట్లు తెలిపారు. తోటి కూలీలు గమనించి అడవి పందిని తరిమి కొట్టడంతో స్థానిక అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు పేర్కొన్నారు. గాయాలైన హేరేకుమ్ర శ్రీకాంత్‌ను 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.

## దరఖాస్తుల పరిశీలన పకడ్బందీగా చేపట్టాలి

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 21: రాజీవ్ యువవికాసం దరఖాస్తుల పరిశీలన పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఆయన ఎంపీడీవోలు, బ్యాంకర్లతో రాజీవ్ యువవికాసం పథకం అమలుపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మండల స్థాయిలో దరఖాస్తులను ఎంపీడీవోలు, బ్యాంకు అధికారులు పరస్పర సమన్వయంతో పరిశీలించాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా మహిళలు, దివ్యాంగులను లబ్దిదారులుగా ఎంపిక చేయాలన్నారు. లబ్ధిదారులకు రుణం మంజూరు చేసే ముందు ప్రత్యేకంగా బ్యాంక్ ఖాతాలు తెరిపించాలన్నారు. ఒకే గ్రామంలో ఎక్కువ మంది ఒకే రకమైన యూనిట్లు పెట్టే పరిస్థితి లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్, నాబార్డ్ డీడీఎం వీరభద్రుడు, సంక్షేమ శాఖ అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 21: జిల్లాలో నేరాల నియంత్రణకు నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని ఎస్పీ జానకీ షర్మిల పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం ఆమె పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ జానకీ షర్మిల మాట్లాడుతూ, పోలీసు అధికారులు ప్రతి గ్రామాన్ని సందర్శించి, నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు. ఏఎస్పీ, సీఐలు తమ పరిధిలోని స్టేషన్లను సందర్శించి సిబ్బంది పని తీరును పర్యవేక్షించాలన్నారు. ప్రజలకు పోలీసులపై ఉన్న నమ్మకాన్ని మరింత పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు ఉపేందర్ రెడ్డి, అవినాష్, రాజేశ్‌మీనా, సీఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 21: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వందన తెలిపారు. ధనోరా(బీ) గ్రామ పంచాయతీ పరిధిలోని జనతగూడ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కమలబాయి, పోషణ్ అభియాన్ కో–ఆర్డినేటర్ పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వసతులు కల్పించాలి

ఖానాపూర్/కడెం, ఏప్రిల్ 21: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు వసతులు కల్పించాలని డీసీవో పాపయ్య సూచించారు. ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు కడెం మండలం కొండుకూర్, దస్తురాబాద్ మండలం రేవోజిపేట గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. సెంటర్ల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తేమ శాతం వచ్చిన ధాన్యం తూకం వేయాలని సూచించారు. కేంద్రాల్లో తాగునీరు, టార్పాలిన్లు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట సీఈవోలు తుఫ్రాన్ శ్రీను, భూమి ఆశన్న, కసుల రాజేందర్, కేంద్రాల నిర్వాహకులు శ్రీకాంత్, కన్నయ్య, రైతులు, తదితరులున్నారు.

## అంకిత భావంతో పని చేస్తేనే గుర్తింపు

కడెం, ఏప్రిల్ 21: ఉద్యోగులు అంకితభావంతో పని చేసినప్పుడే సమాజంలో గుర్తింపు వస్తుందని మండల విద్యాధికారి షేక్ హుస్సేన్ పేర్కొన్నారు. మండలంలోని పెద్దూర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు భూమేశ్వర్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం సోమవారం నిర్వహించగా, ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులను ఉన్నతములుగా తీర్చిదిద్దిన ప్రతి ఉపాధ్యాయుడికి గౌరవం ఉంటుందని పేర్కొన్నారు. సుదీర్ఘకాలం విద్యార్థులకు సేవలందించిన ప్రధానోపాధ్యాయుడు భూమేశ్వర్‌ను అభినందించి, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్, పీఆర్టీయూ కడెం, దస్తురాబాద్ మండలాల అధ్యక్షులు వెంకటరమణ, పురుషోత్తంరెడ్డి, జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్, కూచనపెల్లి శ్రీనివాస్, సుద్దాల రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లకు అర్హులనే ఎంపిక చేయాలి

దస్తురాబాద్, ఏప్రిల్ 21: ఇందిరమ్మ ఇండ్ల కోసం అర్హులనే ఎంపిక చేయాలని మండల ప్రత్యేకాధికారి రాజేశ్వర్ గౌడ్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఎంపీడీవో రమేశ్ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి రాజేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ గోపాల్ కిషన్, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, డైరెక్టర్ వెంకన్న, నాయకులు దుర్గం మల్లేశ్, గుండా నరేశ్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

జైనథ్, ఏప్రిల్ 21: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని గిమ్మా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేందర్ కోరారు. గిమ్మా గ్రామంలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, విద్యా బోధన తీరు గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్, ఎం మహేందర్, శ్రీకాంత్, బాలకృష్ణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బస్సు బిల్లులు చెల్లించాలి

బోథ్, ఏప్రిల్ 21: విద్యార్థులకు పెండింగ్ బస్సు బిల్లులు వెంటనే విడుదల చేయాలని ఐటీడీఏ మాజీ డైరెక్టర్ మెస్రం భూమన్న సోమవారం ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఐటీడీఏ ద్వారా ఆదివాసీ గిరిజన విద్యార్థులు 3 నుంచి పదో తరగతి వరకు జిల్లాలోని బెస్ట్ అవలేబుల్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారని, వారికి 2022 నుంచి బస్సు బిల్లులు రావడం లేదని విన్నవించారు. ప్రభుత్వం వెంటనే బిల్లులు విడుదల చేయాలని కోరారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

బోథ్, ఏప్రిల్ 21: మండలంలోని నక్కలవాడకు చెందిన నైతం భూమన్న మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈనెల 17న తాగి భార్యతో గొడవ పడ్డారు. క్షణికావేశంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. బోథ్‌లోని సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. భూమన్నకు భార్య, కొడుకు ఉన్నాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

ఇచ్చోడ, ఏప్రిల్ 21: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు వైద్య సిబ్బంది చంద్రశేఖర్ సూచించారు. కోకస్‌మన్నూర్ గ్రామంలో సోమవారం పశువులు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

## తెలుగు భాషను పరిరక్షించాలి

భీంపూర్, ఏప్రిల్ 21: రాష్ట్ర ప్రభుత్వం తెలుగు భాషను పరిరక్షించాలని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఉదారి నారాయణ సోమవారం కవులు, రచయితలతో కలిసి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట తెరవే జిల్లా అధ్యక్షుడు బాలసాని నారాయణగౌడ్, కవులు లక్ష్మీనారాయణ, రిజ్వాన్ ఉన్నారు.

## కరెంట్ లేక పంటలు ఎండుతున్నాయి

భీంపూర్, ఏప్రిల్ 21: త్రీఫేస్ విద్యుత్ అర్ధరాత్రుల్లో సమాచారం లేకుండా సరఫరా చేస్తుండడంతో పంటలు ఎండుతున్నాయని అంతర్గాం రైతులు కునార్పు అశోక్, బక్కి కపిల్, కరంజికి చెందిన రెడ్డి రమేశ్‌యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. భీంపూర్ మండల కేంద్రంలో సోమవారం ప్రజావాణి–బహిరంగ విచారణ వేదిక ద్వారా అధికారులు ఇప్పటి వరకు వచ్చిన అర్జీల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, త్రీఫేస్ విద్యుత్ సరఫరా గురించి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి కిషన్, తహసీల్దార్ నలందప్రియ, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, డీటీ హరిదాస్, ఎంపీవో సమీర్‌అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల అభివృద్ధికి కృషి

ఉట్నూర్, ఏప్రిల్ 21: గిరిజనుల అభివృద్ధికి ఐటీడీఏ కృషి చేస్తున్నదని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. స్థానిక పీవో క్యాంపు కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు తమకు ఇండ్లు, పింఛన్లు, స్వయం ఉపాధి పథకాలు మంజూరు చేయాలని అర్జీలు పెట్టుకున్నారు. ఈ దర్బార్‌లో ఏపీవో పీటీజీ మెస్రం మనోహర్, ఏవో దామోదర స్వామి, అదనపు వైద్యాధికారి మనోహర్, ఈఈ తానాజీ, పీహెచ్‌వో సందీప్‌కుమార్, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 21: ఆర్టీసీ సేవలను ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ డిపో మేనేజర్ పండరి కోరారు. ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు సారంగాపూర్ మండలం జవులి, లక్ష్మణాచాంద మండలం మాచాపూర్‌కు ఆర్టీసీ సేవలను సోమవారం పునః ప్రారంభించినట్లు తెలిపారు.

## అర్హులందరికీ రుణాలివ్వాలి

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 21: అర్హులందరికీ రాజీవ్ యువ వికాసం రుణాలందించాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిర్మల్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పార్టీలకతీతంగా బీసీ రుణాలు ఇవ్వాలని కోరారు.